ప్రజాశక్తి

గురువారం 7 నవంబర్ 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు



గుంటూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా

కలెక్టరేట్ల వద్ద విద్యార్థుల ధర్నా

- హామీలు నెరవేర్చాలని, జిఒ 77 రద్దు చేయాలని డిమాండ్
- స్పందించకుంటే చలో విజయవాడకు పిలుపునిస్తాం : ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్‌కుమార్ హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా గుంటూరు, పల్నాడు కలెక్టరేట్ల ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ గేటు ఎదుట విద్యార్థులు నిరసన తెలిపి గుంటూరులో కలెక్టరేట్ ఏవోకు, నరసరావుపేటలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒకు వినతిపత్రాలు ఇచ్చారు. గుంటూరు ధర్నాలో అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి దాదాపు ఐదు నెలలు కావస్తున్నా అమలు చేయలేన్నారు. విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు రూ.3,480 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు బకాయిలు 2లో



సిఐ మాటల వీరంగం..


తమ సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేయడానికి వచ్చిన విద్యార్థులపై నరసరావుపేట రూరల్ సిఐ పి.రామకృష్ణ మాటలతో వీరంగం తొక్కారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులను అనుచితంగా మాట్లాడ్డంతోపాటు ధర్నాలో పాల్గొన్న విద్యార్థులనూ బెదిరించారు. మీ అందరి వీడియోలు, ఫొటోలు తీశానని, వాటి ఆధారంగా కేసుల్లో బుక్ చేస్తే జైలుకెళతారంటూ హెచ్చరించారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనొద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు. అయినా విద్యార్థులంతా ఆందోళన కొనసాగించారు. డిఆర్‌ఒ వచ్చి తమ సమస్యలు వినాలని, వినతిపత్రం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే 2లో



నరసరావుపేట కలెక్టరేట్ ఎదుట ధర్నా

సిఆర్‌డిఎ పరిధి పునరుద్ధరణ

మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం



ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

క్యాపిటల్ రీజియన్ డెవలప్మెంట్ అథారిటీ (సిఆర్‌డిఎ) పరిధిని పెంచుతూ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. వైసిపి ప్రభుత్వ హయాంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో సిఆర్‌డిఎ పరిధిని కుదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పల్నాడు జిల్లా పరిధిలోని పలు మండలాలను, పట్టణాలను సిఆర్‌డిఎ పరిధి నుంచి తప్పించి పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారు. బాపట్ల జిల్లాలోని నాలుగు మండలాలను తప్పించి బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కింద మార్చారు. తాజా నిర్ణయం ప్రకారం గతంలో సిఆర్‌డిఎ పరిధిలో ఉన్న సత్తెనపల్లి మున్సిపాలిటీ, అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు, అచ్చంపేట, ముప్పాళ్ల, యడ్లపాడు మండలాలతోపాటు చిలకలూరిపేట, రాజుపాలెం మండలాలోని పలు గ్రామాలను తిరిగి సిఆర్‌డిఎ పరిధిలోకి తీసుకురానున్నారు. బాపట్ల జిల్లా పరిధిలోని వేమూరు, చుండూరు, అమృతలూరు మండలాలు కూడా సిఆర్‌డిఎ పరిధిలో విలీనం చేయనున్నారు.

వైసిపి ప్రభుత్వ హయాంలో పలనాడు జిల్లా మొత్తాన్ని ఒకే పట్టణాభివృద్ధి సంస్థగా ఏర్పాటు చేసి దానికి చైర్మన్‌గా వైసిపి నేత మిట్టపల్లి రమేష్‌ను నియమించారు. కానీ మొత్తం కార్యవర్గాన్ని ఏర్పాటు చేయలేదు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.శ్రీనివాసరెడ్డిని నియమించారు. వీరికి కనీసం కార్యాలయం, మౌలిక సదుపాయాలేమీ కల్పించలేదు. వీరిద్దరూ కలిసి కొంతమంది రియల్టర్ల నుంచి భారీగా సొమ్ములు వసూలు చేశారని ఆరోపణ కూడా వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టిడిపికి చెందిన రియల్టర్లు తమ వద్ద వసూలు చేసిన సొమ్ములని తిరిగి రాబట్టుకున్నారు. బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావును నియమించారు. ఈ రెండు పట్టణ అభివృద్ధి సంస్థల ద్వారా ఏటువంటి అభివృద్ధి పనులూ చెప్పట్టకుండా కేవలం రాజకీయ ఉపాధి కోసం ఏర్పాటు చేశారనే విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 2015లో ఏర్పాటు చేసిన సిఆర్‌డిఎ పరిధినికి యథాతథ స్థితిని కల్పిస్తూ బుధవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశం నిర్ణయం తీసుకుంది. వైసిపి హయాంలో జరిగిన మార్పును రద్దు చేయాలని తీసుకున్న నిర్ణయంతో సిఆర్‌డిఎ పరిధిలోని ఆయా మండలాలు నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

పట్టభద్ర ఓటర్లు 3.43 లక్షలు

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గంలో ఈసారి ఓటర్లు భారీగా పెరిగారు. 2019లో 2.50 లక్షల ఓటర్లుండగా ఈసారి ఈ సంఖ్య 3,43,770కి పెరిగింది. చివరి రోజున దాదాపు లక్షా 20 వేల దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్ ద్వారా 3,30,536, ఆఫ్‌లైన్ ద్వారా 13,234 వచ్చాయి. అత్యధికంగా గుంటూరు జిల్లా నుంచి 1,07,851, ఎన్టీఆర్ జిల్లా నుంచి 70,269 దరఖాస్తులు వచ్చాయి. బాపట్ల జిల్లా పరిధిలోని వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజక వర్గాల నుండి 24,116, ఏలూరు జిల్లాలోని నూజివీడు, కైకలూర్ నియోజక వర్గాల నుంచి 18,173, పలనాడు జిల్లా నుంచి 58,711 దరఖాస్తులు అందాయని అధికారులు బుధవారం రాత్రి తెలిపారు.

నేడు తాళ్లాయపాలేనికి చంద్రబాబు

విద్యుత్ సబ్ స్టేషన్‌ను ప్రారంభించనున్న సిఎం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభానికి సిద్ధమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం రాజధాని అమరావతి పరిధిలోని మందడం శివారు గ్రామం తాళ్లాయపాలెంలో 400/220 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ, ఎస్పీ సతీష్ కుమార్, ట్రాన్స్కో జెఎండి కీర్తి చేకూరి బుధవారం పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, భద్రత ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. పరిశీలనలో ఎమ్‌టిఎంసి కమిషనర్ అలీంబాష, గుంటూరు ఆర్‌డిఒ కె.శ్రీనివాసరావు, ఎంపిడిఒ శిల్ప, తహశీల్దార్ సుజాత పాల్గొన్నారు.

సిఎం వస్తుండడంతో అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టారు. తాళ్లాయపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ వెళ్లే మార్గంలో రోడ్లపై ఉన్న గుంతలను తారుతో పూడ్చివేయించారు. రహదారులకు ఇరుపక్కలా పిచ్చిమొక్కలు, చెత్తా చెదారాన్ని పారిశుధ్య కార్మికులు తొలగించారు. సభా ప్రాంగణం వద్ద నేలను చదును చేశారు. వేదిక వద్ద పొద్దుపోయాక కూడా పనులు కొనసాగుతున్నాయి. విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఏర్పాట్లను అధికారులతో కలిసి ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ పరిశీలించారు. సిఎం చంద్రబాబు చేసే ప్రారంభోత్సవాలనికి కూటమి పార్టీల శ్రేణులు తరలిరావాలని ఎమ్మెల్యే కోరారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు



సిద్ధమైన విద్యుత్ సబ్ స్టేషన్

బోరుగడ్డకు రాచ మర్యాదలు

ఏడుగురు పోలీసుల సస్పెన్షన్

వార్త మెయిన్‌లో

డిసెంబర్ 15లోగా హాస్టల్ భవన నిర్మాణం పూర్తి చేయాలి

8లో

రేపటి నుండి సిపిఎం ప్రజాపోరు ప్రచార యాత్ర

4లో



నివాళులర్పిస్తున్న టి.శ్రీనివాసరావు తదితరులు

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పారిశుధ్య కార్మికుడు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పిడుగురాళ్ల కార్యదర్శి కాంద్రగుంట సీతారామయ్య మంగళవారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. భౌతికకాయాన్ని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు తెలకపల్లి శ్రీనివాసరావు సందర్శించి పూలమాలలేసి నివాళులర్పించారు. సీతారామయ్య నిరంతరం మున్సిపల్ కార్మికుల సమస్యలపై పోరాడే వారిని, ఏ సమస్య ఉన్నా యూనియన్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం కోసం కృషి చేశారని చెప్పారు. సిపిఎంలోనూ క్రియాశీలకంగా పని చేశారన్నారు. నివాళులర్పించిన వారిలో సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వర్లు, డి.వెంకటేశ్వర్లు, ఎం.రాజు, కృష్ణనాయక్, మున్సిపల్ యూనియన్ నాయకులు ఎ.రామారావు, వెంకటేశ్వర్లు, సిహెచ్.పద్మ, ఎ.ఆంజనేయులు, కె.ఎల్లమంద, కె.శ్రీను, జి.నాగేశ్వరరావు ఉన్నారు.



అంత్యక్రియల కోసం తక్షణ సాయం

సీతారామయ్య మృతిపై మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ వెంటనే స్పందించారు. అంత్యక్రియల నిమిత్తం మృతుని కుటుంబానికి రూ.15 వేల తక్షణ సాయాన్ని చెక్కుద్వారా అందించారు. ఈ చెక్కును సీతారామయ్య కుటుంబానికి పారిశుధ్య విభాగ కార్యదర్శి మెహర్, మున్సిపల్ సిబ్బంది అందజేశారు.



కేకును కట్ చేస్తున్న నాయకులు

ఘనంగా కొమ్మాలపాటి శ్రీధర్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - పెదకూరపాడు

టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు ఎ.రమేష్ నివాసంలో బుధవారం వేడుకలు నిర్వహించారు. మాజీ ఎంపిపి బి.రాంగోపాల్రావు, సర్పంచ్ గుడిపూడి రాజు మాట్లాడారు. నాయకులు సత్యం, సాగర్, మల్లికార్జున్, లీలావతి, ముంతాజ్, కల్పన, అప్పారావు, పాపయ్య, హనుమంతరావు, అజీముల్లా, కనగండ్ల సర్పంచి కోరంపల్లి వెంకటరామయ్య, నరేంద్ర, వెంకటరావు, వీరయ్య, సురేష్, శివ, బాష, కోటేశ్వరరావు, రఘు, నాగమల్లి, సుధాకర్, నారాయణ, రమేష్, శ్రీను, మార్కు చిన్న పాల్గొన్నారు.

కలెక్టరేట్ల వద్ద విద్యార్థుల ధర్నా



గుంటూరు ధర్నాలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్

(మొదటి పేజీ తరువాయి)

ఉండటం వల్ల విద్యార్థులు కోర్సు పూర్తి చేసినా సర్టిఫికెట్లు రాక ఇబ్బంది పడుతున్నారన్నారు. బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. పేద విద్యార్థులకు పీజీ విద్యను దూరం చేస్తున్న జిఒ 77 రద్దు చేయాలన్నారు. ఈ జీఒ ద్వారా ప్రైవేటు, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపివేసిందని, దీంతో ఫీజులు చెల్లించలేని వారు ఉన్నత విద్యకు దూరం అయ్యారని తెలిపారు. గత ప్రభుత్వం విద్యారంగంలో అనుసరించిన విధానాలు చీడపురుగుల్లా వెంటాడుతున్నాయని, తాము అధికారంలో వస్తే వందరోజుల్లో ప్రక్షాళణ చేస్తామని యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ ఇచ్చినా ఇంత వరకూ హామీల ఊసే లేదన్నారు. తల్లికి వందనం, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఇచ్చిన హామీ అమలులో స్పష్టత లేదన్నారు. విద్యారంగంలో సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే కాలంలో చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రకటించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ డిగ్రీలో హానర్స్ విధానం విద్యార్థులకు శాపంగా మారిందని, విద్యార్థికి కోర్సు ఎంపిక చేసే హక్కును కాలరాసిందని అన్నారు. పరీక్షా విధానం గందరగోళం అయ్యిందని, చివరికి విద్యార్థికి ఏ సెమిస్టర్‌కు ఏ పరీక్ష ఉంటుందో కూడా అర్థంకాని పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. దీంతో డిగ్రీలో చేరేందుకు ఆసక్తి చూపట్లేదని, చేరిన వారు కూడా మధ్యలోనే మానేస్తున్నారన్నారు. జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని పునరుద్ధరించాలని కోరారు. హాస్టల్స్‌కు సొంత భవనాలు లేక, చాలీ చాలని వసతులతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, కాస్మొటిక్, మెస్ బిల్లులు సైతం నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో హాస్టళ్ల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. అన్నా క్యాంటీన్లకు ప్రభుత్వం రూ.96లు కేటాయిస్తుందని, భావితరాలు చదువుకునే హాస్టళ్లకు రోజుకి రూ.53 (కళాశాల), రూ.46 (పాఠశాల)లు మాత్రమే ఇస్తోందని తెలిపారు. ఇప్పుడున్న ధరలకు అనుగుణంగా రోజుకి మెస్ ఛార్జీలు రూ.100కు పెంచాలని కోరారు. యూనివర్సిటీల్లో ఖాళీలు భర్తీ చేయాలని, గుంటూరు నగరంలోని కోడుగుడ్డు సత్రం హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలని, ప్రతి ఆదివారం కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలకు తప్పని సరిగా సెలవుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, ఉపాధ్యక్షులు నవిత, సహాయ కార్యదర్శి యశ్వంత్, జిల్లా కమిటీ సభ్యులు అభి, జమీర్, కమిటీ సభ్యులు షంషీర్, రాజ్, యశ్వంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భారీ ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాలతో పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం వచ్చిందన్నారు. ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు.



నరసరావుపేటలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రతి మండల కేంద్రంలో ఏపీ మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని, తల్లికి వందనం కింద ఒక్కో విద్యార్థికి రూ.15 వేలు వెంటనే విడుదల చేయాలని కోరారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అమూల్య, నాయకులు యాసీన్, ఫణీంద్ర, సిద్ధు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఐ మాటల వీరంగం..

(మొదటి పేజీ తరువాయి)

కొంతమంది వెళ్లి వినతిపత్రం ఇచ్చి రావాలని సిఐ చెప్పగా ఎస్ఎఫ్ఐ నాయకులు అందుకు నిరాకరించారు. గతంలో ఇదేవిధంగా 10 మందిమి వెళ్లి అప్పటి డిఆర్ఒను కలిసి వినతిపత్రం ఇచ్చామని, సమస్యలను పరిష్కరించాలని కోరితే.. 'ఉద్యోగం లేకపోతే ఏంటి గేదెలు మేపుకుని బతకొచ్చుగా' అని అవమానకర రీతిలో మాట్లాడరని చెప్పారు. గతానుభవాల దృష్ట్యా అధికారులే విద్యార్థుల వద్దకు వచ్చి వినతిపత్రం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇవేమీ పట్టించుకోని సిఐ... విద్యార్థులు ఇక్కడి నుండి వెళ్లిపోవాలని, లేకపోతే కేసులు పెడతామని మరోసారి బెదిరింపులకు పూనుకోవడంతో నాయకులు కొంతమంది డిఆర్ఒ ఛాంబర్‌కు వెళ్లి ఇన్‌ఛార్జి డిఆర్ఒ నారదమునికి వినతిపత్రం ఇచ్చారు. ఇదిలా ఉండగా విద్యార్థులను బెదిరించడంతోపాటు అవమానకర రీతిలో మాట్లాడిన రూరల్ సిఐ పి.రామకృష్ణపై ప్రజా సంఘాలతో కలిసి ఉన్నతాధికారుకుల ఫిర్యాదు చేస్తామని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు.

తరచూ ట్రాఫిక్ చక్రబంధంతో చిక్కులు

ప్రజాశక్తి-తాడేపల్లి

దిన దినాభివృద్ధి చెందుతూ వాహనాల తాకిడి పెరిగిన తాడేపల్లిలో ట్రాఫిక్ పోలీసులు ఎక్కడ? అని వాహందారులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి నివాసాలతో పాటు సుమారు 40 రకాలైన వివిధ ప్రభుత్వ కార్యాలయాలు తాడేపల్లి పట్టణ పరిధిలో ఉన్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నిత్యం అనేక వేలమంది రాకపోకలు సాగిస్తుంటారు. వీఐపీలు, వివిఐపిలు, మంత్రులు నివాసాలు కూడా ఈ ప్రాంతంలో ఉండటంతో కార్లతో పాటు ద్విచక్ర వాహనాల రాకపోకలు విపరీతంగా పెరిగాయి. అమరావతి రాజధాని ప్రకటించగానే తాడేపల్లి పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్ చేశారు. సిఐ స్థాయి అధికారులతో పాటు నలుగురు ఎస్ఐలను కూడా ఇక్కడ నియమించారు. బైపాస్ రోడ్డు వారిది దగ్గరా ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ కూడా సిఐ, ఎస్సై అధికారితో పాటు కానిస్టేబుల్స్ విధులు నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి నివాసం ఉన్న ఉండవల్లి, తాడేపల్లి బైపాస్ రోడ్డు తదితర



ప్రాంతాల్లోని ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహిస్తూ కనిపిస్తున్నారు. ఉండవల్లి సెంటర్‌తో పాటు మణిపాల్ ఆస్పత్రి, సోనోవిజన్ షోరూం, బైపాస్ రోడ్ లోని మిగిలిన ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీగా ఉండేచోట ట్రాఫిక్ పోలీసులు కనిపిస్తుంది అని ప్రజలతో పాటు వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో నిత్యం ఎక్కడికక్కడ ప్రజలు ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకొని విలవిల్లాడిపోతున్నారు.

ఉండవల్లి సెంటర్ నుండి అమరావతి వెళ్లే రోడ్లో విట్, ఎస్ఆర్ ఎం, కాలేజీ బస్సులతో పాటు వివిధ పాఠశాలల బస్సులు, అమరావతి, రాష్ట్ర అసెంబ్లీకి వెళ్లే బస్సులు రోజు 100 దాకా ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇవి కాకుండా కార్లు, ద్విచక్ర వాహనాలు సరే సరే. నిత్యం ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సిక్కులు తలెత్తుతున్నాయి. ఫలితంగా గంటల తరబడి తమ తమ గమ్యస్థానాలు చేరుకోలేకపోతున్నామని వాహనదారులు వాపోతున్నారు. వృద్ధులు రోడ్డు దాటాలంటే నరకయాతన అనుభవించాల్సి వస్తోంది. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో వాహనాలు భారీగా పెరిగాయి. రోడ్లు మాత్రం 20 ఏళ్ల క్రితం వేసిన రోడ్లే కావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడటం నిత్యకృత్యంగా మారింది. దీనికి తోడు ట్రాఫిక్ పోలీసులు కూడా తగిన సంఖ్యలో లేకపోవడం, వాహనదారులు ఎలా పెడితే అలా వాహనాలు నడపటం కూడా ట్రాఫిక్ సమస్యకు కారణం అవుతోంది. సంబంధిత పోలీసు అధికారులు తాడేపల్లికి తగినంత మంది ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేసి, ట్రాఫిక్ రూల్స్ పట్ల వాహనదారుల్లో చైతన్యం కలిగించి ట్రాఫిక్ అంతరాయానికి ఫుల్‌స్టాప్ పెట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు.

రేషన్ కార్డుల కోసం నిరీక్షణ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటుగా అన్ని కార్యక్రమాలకు రేషన్ కార్డులు తప్పనిసరి అయ్యింది. అర్హులైన వారికి రేషన్ కార్డులు ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికలకు ముందు వాగ్దానాలు చేశారు. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా కొత్త కార్డుల జారీ ప్రక్రియ మొదలు కాలేదు. దీంతో సచివాలయాల్లో దరఖాస్తులు కుప్పలుగా పేరుకుపోయాయి. కార్డుల కోసం జనం సచివాలయాలకు, తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అధికారులేమో సంక్రాంతి సందర్భంగా ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉందని అంటున్నారు.

కొత్తగా వివాహం చేసుకున్న వారు, కుటుంబాల నుంచి విడిపోయిన వారు, వలస వచ్చిన వారు, ఇతర పట్టణాలు, గ్రామాలకు బదిలీ అయిన వారు, ఇల్లు మారిన వారు, కొత్త రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్నారు. ప్రస్తుతం కొత్త రేషన్ కార్డులు జారీ చేయడానికి ఇల్లు మారినా, ఊరు మారినా రేషన్ కార్డులలో చిరునామా మార్చడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. రేషన్ కార్డు పోగొట్టుకుంటే కొత్తరేషన్ కార్డుతీసు కోవడానికి కుదరటం లేదు. గతంలో ఉన్న రేషన్ కార్డులు ప్రింట్ తీసుకోవటానికి కూడా వీలు లేకుండా సర్వర్‌ను నిలిచిపోయింది.

చిలకలూరిపేట పట్టణంలోని 38 వార్డులో వార్డుకు కొత్త కార్డులు కోసం ఎదురు చూసే వారి సంఖ్య 150 /200 వరకు ఉంది. పట్టణం మొత్తంగా ఏడు వేల నుండి 9 వేల మంది ఉన్నారు. వీరికి కార్డులు వస్తేనే రేషన్ సరుకులు తీసుకోవాలన్నా, ప్రభుత్వ పథకాలు పొందాలన్నా. పట్టణ, మండల స్థాయిలో ప్రస్తుతం 45 నుంచి 50 వేల రేషన్ కార్డులున్నాయి. వీరికి ప్రతినెలా 42 క్వింటాళ్ల బియ్యన్ని సరఫరా చేస్తున్నారు. పంచదార కంది పంపు తీసుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులకు తోడుగా కొత్త రేషన్ కార్డు ఇస్తే రేషన్ డీలర్ల సంఖ్య కూడా పెరగనుంది. గత ప్రభుత్వం హయాంలో నుంచి పెండింగ్లో ఉన్న కొత్త రేషన్ కార్డులు మంజూరు పైన ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదు.

మంత్రి సవిత మానవత్వం

హైవేపై రోడ్డు ప్రమాదంలో 4గురికి గాయాలు - ఒకరి పరిస్థితి విషమం

క్షతగాత్రులను తన వాహనంలో ఎన్ఆర్ఐకి తరలించిన మంత్రి

గాయపడిన వారికి ఆసుపత్రికి వెళ్లి పరామర్శ

మెరుగైన వైద్యమందించాలని వైద్యులకు ఆదేశం



ప్రజాశక్తి - తాడేపల్లి

రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత మానవత్వం చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నలుగురు మహిళలను తన వాహనంలో స్వయంగా దగ్గరుండి ఆసుపత్రికి తరలించారు. బుధవారం సాయంత్రం తాడేపల్లి సమీపంలోని కుంచనపల్లి జయభేరి అపార్టుమెంట్‌లో పనికోసం వచ్చిన నలుగురు మహిళలు తమ ఇళ్లకు బయలుదేరారు. జయభేరి అపార్టుమెంట్ ఎదురుగా ఉన్నహైవేను దాటుతుండగా, విజయవాడ నుంచి గుంటూరు వెలుతున్న ఆర్టీసీ బస్సు నలుగురు మహిళలను ఢీకొట్టింది. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. దీంతో అదే సమయంలో అటుగా వెలుతున్న మంత్రి సవిత తక్షణమే స్పందించారు. క్షత గాత్రులను ఓదర్చుతూ తాను ఉన్నానని భరోసా కల్పించారు. 108 వాహనం వచ్చే వరకు ఆగకుండా, క్షతగాత్రలను తన వాహనంలోనే మంగళగిరి ఎన్ఆర్ఐ ఆసుపత్రికి తరలించారు. వేరే వాహనంలో మంగళగిరిలోని ఎన్ఆర్ఐ ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యమందించాలని వైద్యులకు ఆదేశించారు. ఓ మహిళ పరిస్థితి తీవ్రంగా ఉందని వైద్యులు తెలిపారు. తక్షణమే స్పందించి, క్షతగాత్రులను తన సొంత వాహనంలో ఆసుపత్రికి తరలించిన మంత్రి సవితపై వాహనచోదుకులు, స్థానికులు ప్రశంసలు కురిపించారు. రోడ్డు ప్రమాదంతో తాడేపల్లి హైవేపై కిలో మీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. గాయపడిన వారు ఆదిలక్ష్మి, నారాయణమ్మ, సరస్వతి, నారాయణమ్మ అని జయభేరి సిబ్బంది తెలిపారు.

సరస్వతి సిమెంట్స్ భూములపై డిప్యూటీ సీఎం వాఖ్యలు

డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే...

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురజాల సరస్వతి సిమెంట్స్‌కు చెందిన భూములపై చేసిన వ్యాఖ్యలు అర్ధరహితమని హఠాత్తుగా సరస్వతి భూములపై దృష్టి పెట్టడం ఎవరికీ అర్ధం కాని విషయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. గుంటూరు రోడ్డులోని వైసిపి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ 2004 - 2009 మధ్యలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతుల దగ్గర అప్పటి భూముల విలువకు 3 రెట్లు అధిక ధరకు కొనుగోలు చేశారని తెలిపారు. 2014 - 2019 మధ్యలో టిడిపి ఈ భూములపై విచారణ జరిపి వివరాలు సేకరించారని ఎటువంటి అటవీ లేదా అసైన్డ్ భూములు లేవని తేల్చారని గుర్తు చేశారు. కానీ పవన్ కళ్యాణ్ ప్రస్తుతం 400 ఎకరాల అటవీ భూములను, రెవెన్యూ భూములుగా మార్చారని ఆరోపణలు చేయడం రాజకీయ కుట్రలో బాగమన్నారు. అటవీ భూముల విషయంలో, కనీసం 2 హెక్టార్ల కన్నా ఎక్కువ అటవీ భూమి ఎవరైనా తీసుకోవాలంటే తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వం అనుమతి తీసుకోవాల్సిన ఉంటుందనే విషయం ఉప ముఖ్యమంత్రికి తెలియక పోవడం హాస్యాస్పదమన్నారు. అటవీ భూములు తీసుకోవాల్సి వస్తే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఈ భూముల వివరాలు కేంద్రానికి నివేదించి అనుమతులు అనంతరం సేకరించాల్సి ఉంటుం దన్నారు. సరస్వతి సిమెంట్స్ వారు కొనుగోలు చేసిన భూములకు సంబంధించిన వివరాలు పరిశీలిస్తే పూర్తి వివరాలు తెలుస్తాయాన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి అటవీ భూముల విషయంలో కేంద్ర ప్రభుత్వ అనుమతుల సాధనకు వైసిపి హయాంలో 5 ఏళ్ళు పట్టిందన్నారు. కోటప్పకొండ ఘాట్ రోడ్డు వేయాలన్నా కేంద్రం అనుమతి తీసుకోవాల్సి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో విచారణ జరిపిన రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు సరస్వతి భూములలో ఎటువంటి అటవీ భూములు లేవని సరస్వతి భూములకు అటవీ భూములకు 7 మీటర్ల దూరం ఉందని తేల్చారన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా అటవీ శాఖ మంత్రి హోదాలో 400 ఎకరాల అటవీ భూములు తీసుకున్నారని ఎలా ప్రకటిస్తారన్నారు. సంఘీ కంపెనీ 4 వేల ఎకరాలు ప్రభుత్వ భూములు తీసుకొని ఇప్పటివరకు ఫ్యాక్టరీ కట్టలేదని గుర్తు చేశారు. ఈ రాష్ట్రంలో ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 90 అత్యాచారాలు జరిగాయని అత్యాచారాలపై హోం శాఖ మంత్రి అనిత బహిరంగంగా విమర్శలు చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. దీపం పథకానికి రూ 2800 కోట్లు కేటాయించి విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట రూ 17 వేల కోట్లు భారాలు వేశారన్నారు. ప్రస్తుతం కరెంటు బిల్లు రూ 1.90 పైసల నుంచి రూ 4.50 పై వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికలకు ముందు కరెంట్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చారు ఆ హామీను అదేమిటంటే ఇది గతంలో జగన్ తప్పిదాల వల్ల వస్తుందని ప్రజల్ని మభ్యపెడుతున్నారు. ఉచిత ఇసుక ప్రచార ఆర్భాటమన్నారు. రూ 1500 లకు కూడా టన్ను ఇసుక దొరకని పరిస్థితి నెలకొందన్నారు. భవన నిర్మాణ కార్మికులు, అధిక ధరలకు ఇసుక కొనలేక యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వసతి దీవెన, విద్యాదీవెన, తల్లికి వందనం అమలు చేసి ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని గుండిమెడ గ్రామంలో వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీకి గురయ్యింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పాటిబండ్ల కస్తూరమ్మ అనే వృద్ధురాలి మెడలోని 8 సవర్ల బంగారు గొలుసును గుర్తుతెలియని దొంగ తెంపుకొని వెళ్లినట్లు ఆలస్యంగా వెలుగు చూసిందన్నారు. బాధిత వృద్ధురాలు బుధవారం తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు చాకలిగుంట వద్ద కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

కమ్యూనిస్టు బొమ్మల సెంటర్ చాకలిగుంట వద్ద సిపిఐ ఆధ్వర్యంలో అందత్వ నివారణ సంస్థ వారి సౌజన్యంతో శంకర్ కంటి ఆస్పత్రి వారి ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరం (శుక్లముల ఆపరేషన్లు) యేర్పాటు చేసినట్లు సిపిఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తెలిపారు. గుంటూరు నగరంలో గత రెండు,మూడు సంవత్సరాలుగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించడమే కాకుండా సుమారు 2500 మందికి ఉచితంగా కంటి వైద్యం (శుక్లాముల ఆపరేషన్లు) చేయించడమైనది అనే అలాగే గుంటూరు నగరంలో శారదా కాలనీ,చాకలిగుంట, సిపిఐ కాలనీ, చంద్ర రాజేశ్వరరావు నగర్,ప్రగతి నగర్, పాత గుంటూరు, తదితర ప్రాంతాల్లో ఇప్పటికే అనేకసార్లు నిర్వహించడం అయినదని తెలిపారు. కంటి చూపు తగ్గిన అందరూ పాల్గొనే వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన వారికి ఆ రోజే శంకర్ కంటి ఆసుపత్రికి వారి బస్సులో తీసుకెళ్లడం అలాగే ప్రయాణ ఖర్చులు అవసరమైన తిండి ఏర్పాటులు వారు చేస్తారని అందువలన అందరూ పాల్గొని.కంటి చూపును కాపాడుకోవాలని నగర ప్రజలకు పిలుపునిచ్చారు.

ట్రూ అప్ చార్జీల విధానాన్ని రద్దు చేయాలి

అవగాహన సంస్థ డిమాండ్

ప్రజాశక్తి - గుంటూరు

అధికారంలోకి ఏ పార్టీ వచ్చినా విద్యుత్ వినియోగదారులపై భారం తప్పడం లేదని, చార్జీలు పెంచబోమంటూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అందుకు భిన్నంగా ప్రజలపై భారం వేస్తున్న ప్రభుత్వ తీరును ప్రజలు నిరసించాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ట్రూ అప్, సర్దుబాటు అంటూ వివిధ రకాల చార్జీల పేరుతో భారాలు మోపటంతో అసలు విద్యుత్ యూనిట్ ధర కంటే వీటి ధర అధికంగా ఉంటుందని విమర్శించారు. ఈ నెల బిల్లుల నుండే రూ. 6,072.82 కోట్ల వడ్డన చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు కొత్తగా రూ.11,826.15 కోట్లు భారం వేసేందుకు సిద్ధమవుతుందని, ఈ ప్రకారం చార్జీలను అమల్లోకి వస్తే ఇప్పుడు చెల్లిస్తున్న విద్యుత్ బిల్లులు రెండు రెట్లు, మూడు రెట్లు పెరుగుతాయని అవగాహన సంస్థ ఆందోళన ప్రకటించారు. ఒక్కో యూనిట్ పై రూ.3 అదనంగా భారం పడుతుందని, ఇప్పటికే పెరిగిన బిల్లులు చూసి బెంబేలెత్తుతున్న వినియోగదారులు ఈ కొత్త సర్దుబాటుతో పిచ్చెక్కి పోతారన్నారు. ప్రభుత్వ విద్యుత్ ప్లాంట్ల నుండి కరెంటు తీసుకోకుండా అధిక ధరలకు ఓపెన్ మార్కెట్లో చెల్లింపులు చేయడం విద్యుత్ నష్టాలకు ఒక కారణమని, ప్రైవేట్ కంపెనీలకు అడ్డగోలుగా చెల్లింపులు చేయటం మరొక కారణమని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది. ప్రభుత్వాల తప్పుడు విధానాలు, అవినీతి, అక్రమాలకు ప్రజలను బలి చేయడం తగదని, ప్రభుత్వం చేసిన తప్పులకి ప్రజలు భారాలు మోయాలనటం అసంబద్ధమని అవగాహన సంస్థ విమర్శిస్తుందని, మోసపూరితమైన ట్రూ అప్ విధానాన్ని రద్దు చేయాలని, మొత్తం రూ.18 వేల కోట్ల ట్రూ అప్ భారాలను ఉపసంహరించాలని అవగాహన సంస్థ డిమాండ్ చేస్తుందని శివరామిరెడ్డి తెలిపారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని తిమ్మాపురం ఉమామహేశ్వర కాటన్ మిల్లు వద్ద గురువారం నుంచి సిసిఐ పత్తి కొనుగోలు ప్రారంభిస్తామని చిలకలూరిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి యు.యోగేశ్వరరావు బుధవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సీసీఐ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభిస్తారన్నారు. పంటను అమ్ముకోవాలని అనుకున్న రైతులు తొలుత నమోదు చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ గోతాల్లో కాకుండా గోనె సంచుల్లో పత్తిని తీసుకురావాలన్నారు.



స్విమ్మింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం ఎస్ఎస్ఎన్ కళాశాలలో స్విమ్మింగ్ పూల్ నందు పల్నాడు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాలబాలికల స్విమ్మింగ్ పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం ప్రారంభించారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఒత్తిడిని జయించేందుకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. ఆనందంగా, ఆరోగ్యకరంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు సురేష్ కుమార్, టిడిపి నాయకులు కపిలవాయి విజయికుమార్ పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయంలో నిరీక్షిస్తున్న ప్రజలు

ప్రజలకు ప్రతిరోజూ నిరీక్షణే

ప్రజాశక్తి - దాచేపల్లి

స్థానిక తాహశీల్దార్ కార్యాలయం సిబ్బంది పనితీరుపై ప్రజలు అసంతృప్తిగా ఉన్నారు. సిబ్బంది గంట ఆలస్యంగా విధులకు వస్తున్నారని, వచ్చాక వీడియో కాన్ఫరెన్స్‌లు, నాయకులతో మీటింగులంటూ సామాన్యులకు అవకాశం ఇవ్వడం లేదని అంటున్నారు. వివిధ సమస్యలపై సామాన్యులు వెళితే పనులు చేయడం లేదని, నిరీక్షించాల్సి వస్తోందని, మరోవైపు దళారులు వెళితే మాత్రం వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శిస్తున్నారు. తహశీల్దార్‌ను కలవడానికి రోజులో రెండు గంటలైనా సమయం కేటాయించాలని, వివిధ ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని కోరుతున్నారు.

వచ్చేనెల 14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వచ్చే నెల 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని మండల న్యాయసేవాధికారి సంస్థ చైర్మన్ కె.నరేంద్రరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, భరణం, చెకబౌన్స్ ఇతర కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

రేపటి నుండి సిపిఎం ప్రజాపోరు ప్రచార యాత్ర

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై ఆందోళన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై శుక్రవారం నుండి 15వ తేదీ వరకూ జిల్లావ్యాప్తంగా ప్రజాపోరు - ప్రచార యాత్ర నిర్వహిస్తామని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ తెలిపారు. 15వ తేదీన మండల కేంద్రాల్లో, ఆర్డీఓ కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ప్రజాపోరు-ప్రచారయాత్ర కరపత్రాలను నరసరావుపేట పట్టణంలోని కోటప్పకొండ రోడ్డులోగల సిపిఎం కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గుంటూరు విజయ్‌కుమార్ తదితరులు

విస్మరించిందన్నారు. పెరిగిన నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలతో పేదలు అర్ధాకలితో బతుకుతున్నారని అన్నారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట రూ.17 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేసేందుకు కూటమి ప్రభుత్వం పూనుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రాల హక్కులను, రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తూ జమిలీ ఎన్నికల విధానం కేంద్రం తెస్తోందని విమర్శించారు. పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని, ఉపాధి అవకాశాలు తగ్గిపోయాయని అన్నారు. దేశానికి వెన్నెముకయిన ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కుట్రలు పన్నుతున్న బిజెపికి, దానికి వంతపడుతున్న పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలపై, చిన్నారులపై దాడులు అత్యాచారాలు పెరిగిపోయాయని, చట్టాలను సమగ్రంగా అమలు చేసి దాడులకు పాల్పడిన వారిని శిక్షించడం ద్వారా దాడులు నివారణకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ అంశాలపై సిపిఎం చేపట్టే ఆందోళనల్లో ప్రజలు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శులు షేక్. సిలార్ మసూద్, సయ్యద్ రబ్బాని, నాయకులు డి.శివకుమారి, జి.మల్లీశ్వరి, కె.రామారావు, మస్తాన్ వలి, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలి

మాచర్ల పట్టణ ఎస్ఐ సంధ్యారాణి - ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఐ సంధ్యారాణి, హాజరైన విద్యార్థులు

ప్రజాశక్తి - మాచర్ల, మాచర్ల రూరల్

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని అర్బన్ ఎస్ఐ సంధ్యారాణి సూచించారు. విద్యార్థులు-మత్తు పదార్థాలు అనే అంశంపై స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో బుధవారం సదస్సు జరిగింది. సదస్సుకు ఎస్ఎఫ్ఐ నాయకులు కె.జ్యోతిష్‌కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ తల్లి, తండ్రులు, అధ్యాపకుల పట్ల గౌరవంతో ఉండాలని, చదువు మీద శ్రద్ధ పెడితే ఉన్నత భవిష్యత్‌కు దగ్గర అవుతారని చెప్పారు. మద్యం, మత్తుపదర్థాలు లాంటి చెడు అలవాట్లకు లోనైతే జీవితాలను నష్టపోతారని వివరించారు. ఆడపిల్లలకు భద్రత ఏర్పాటు విషయంలో పోలీసులకు అండగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ బాలయ్య మాట్లాడుతూ పట్టుదల, శ్రమతో కృషి చేసి విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు రాజు మాట్లాడుతూ క్రమశిక్షణతోనే మంచి అలవాట్లు వస్తాయన్నారు. కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు చైతన్య, శ్రవణ్, సతీష్ చంద్ర పాల్గొన్నారు.

రోజుమార్చి రోజు కుక్కకాటు..

బెంబేలెత్తిస్తున్న కుక్కలు - బైక్‌పై వెళ్తున్న మహిళపై దాడి - ఇప్పటికే పలువురు బాధితులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పట్టణ, గ్రామాల్లో వీధి కుక్కల బెడద రోజు రోజుకూ పెరుగుతోంది. తాజాగా గణపవరంలోని జెడ్‌పి పాఠశాల ఎదురుగా ఉన్న సచివాలయం వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళపై వీధి కుక్క దాడి చేయగా ఆమె కుడికాలికి గాయమైంది. ఉదయం 9 గంటలప్పుడు తన కుమారుణ్ణి తీసుకెళ్తుండగా ఈ ఘటన జరిగింది. స్థానికులు సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించారు. గడిచిన నెల రోజుల వ్యవధిలో సుమారు 20 మందికి పైగా కుక్క కాటుకు గురయ్యారు. కుక్కల దాడిలో 10 లేగదూడలు, గొర్రెలు మృతి చెందాయని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి మారుతిబాబును వివరణ కోరగా నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. చిలకలూరిపేట పట్టణం రాగన్నపాలెం, శుభాని నగర్, పాటిమీద గుర్రాల చవిడి తదితర ప్రాంతాల్లోనూ వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. పిల్లలను పాఠశాలలకు తీసుకెళ్లి మళ్లీ తీసుకువచ్చే సందర్భాల్లో తల్లిదండ్రులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

టెన్నికాయిట్ రాష్ట్రస్థాయి పోటీలకు నారాయణ విద్యార్థులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్నికాయిట్ పోటీల్లో స్థానిక నారాయణ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. అండర్-19 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎం.పూజిత్, కె.మనస్వి వెంకటసాయి ఎంపికైనట్లు హెచ్ఎం ఎస్.శేషగిరిరావు తెలిపారు. వీరిని హెచ్ఎంతోపాటు ఎజిఎం లక్ష్మణరెడ్డి, పిఇటి కృపారావు, ఎవో స్వామి అభినందించారు.





అచ్చంపేట రైల్వే గేటు మూసివేత

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

రైల్వే ట్రాక్ మరమ్మతులు కారణంగా సత్తెనపల్లి - అచ్చంపేట మార్గంలోని రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటును రైల్వే అధికారులు బుధవారం మూసివేశారు. గురువారం సాయంత్రం 7 గంటల వరకు గేటు మూసే ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో వాహనదార్లు భీమవరం గేటుమీదుగా రాకపోకలు సాగిస్తున్నారు.



నాగార్జున కొండను సందర్శించిన శ్రీలంక దేశస్తులు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండను 50 మంది శ్రీలంక దేశస్తులు బృందం బుధవారం సందర్శించింది. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి శాంతిసిరి లాంచీలో వారు కొండకు చేరుకొన్నారు. కొండలోని మ్యూజియంలో ఉన్న బుద్ధిని ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, 9 అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధశాల, స్నానాల గట్టు, బోధి వృక్షాన్ని సందర్శించారు. నాగార్జున సాగర్ ప్రాముఖ్యత గురించి పర్యాటక శాఖ ఉద్యోగులు వివరించారు.

పశుగణన ప్రారంభం

ప్రజాశక్తి - కారంపూడి

21వ జాతీయ పశు గణన వారోత్సవాల్లో భాగంగా కారంపూడిలో ఇన్‌ఛార్జి పశువైద్యాధికారి దిలీప్ ఆధ్వర్యంలో ఎంపిడిఓ జి.శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ సరస్వతి బాలు నాయక్ బుధవారం ప్రారంభించారు. పశు వైద్యాధికారి మాట్లాడుతూ నవంబర్ 2024 నుండి 2025 ఫిబ్రవరి వరకు పశువుల సర్వేను ఉంటుందని, రైతులు తమ పశువుల వివరాలను యాప్‌లో నమోదు చేయించుకుని సహకరించాలని కోరారు.



వరద బాధితులందరికీ నష్టపరిహారం ఇవ్వాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్



ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో ఇటీవల వచ్చిన వరదలకు తీవ్రంగా నష్టపోయిన సుందరయ్య నగర్, మహానాడు, కృష్ణవేణి నగర్ వరద ప్రభావిత బాధితులందరికీ న్యాయం చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. బుధవారం పైన పేర్కొన్న ప్రాంతాల్లో రామారావుతో పాటు స్థానిక మహిళా శాఖ కార్యదర్శి పి గిరిజ పర్యటించి బాధితులతో మాట్లాడారు. సుందరయ్య నగర్ ప్రాంతంలో సిపిఎం నిర్వహించ తల పెట్టిన ప్రజా పోరు పాదయాత్ర జయప్రదం చేయాలని కోరుతూ జరిగిన విస్తృత సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ బీజేపీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఎన్నడూ లేని విధంగా నిత్యవసర సరుకులు ధరలు, డీజిల్, పెట్రోలు, వంటగ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటే అని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, బాలికలు, యువతులపై హత్యాచారాలు హత్యలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిందితులపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. జెమి లిఎన్నికల పేరుతో ఒకే దేశం, ఒకే ఎన్నిక, ఒకే చట్టం పేరుతో రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీయటానికి బిజెపి ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ నినాదాన్ని అమలు చేయడమే మోడీ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని చెప్పారు. ఫెడరల్ రాజ్యాంగాన్ని దెబ్బతీస్తూ రాష్ట్రాల హక్కులను కాలు రాస్తున్నారని విమర్శించారు. ప్రశ్నించ వలసిన రాష్ట్రంలోని ప్రధాన అధికార, ప్రతిపక్ష పార్టీలు మిన్నకున్నాయని ఎద్దేవ చేశారు. ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగాన్ని కారు సౌకగా బడ పెట్టుబడిదారులు అమ్మేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రానికి మనీ మ కుటమైన విశాఖ ఉక్కును కూడా అమ్మటానికి ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉక్కు కార్మికుల పోరాటంతో ప్రైవేటీకరణ విధానం తిప్పి కొట్టారని తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం ఈ ప్రాంతంలోని పేదలందరికీ ఇళ్ల స్థలాలను రెగ్యులైజేషన్ చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సర్దుబాటు చార్జీలు పేరు తో ప్రజలపై 14 వేల కోట్ల భారాలు వేయటం సరైనది కాదని చెప్పారు. సిపిఎం పట్టణ కార్యదర్శ వర్గ సభ్యులు కొట్టే కరుణాకర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక విధానా న్ని వెంటనే అమలులోకి తీసుకురావాలని కోరారు. మద్యం పాలసీలు బెల్ట్ షాపులు నియంత్రించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నారిన నాగేశ్వరరావు, ఎస్ కే భాష, కే ప్రభాకర్, ఎల్ సత్యం, బి కుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జొన్నా శి వశంకరరావు

ప్రజాశక్తి - తాడేపల్లి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని తెలుగుదేశం ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు నిరసించాలని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకర కోరారు, బుధవారం తాడేపల్లి మేక అమరారెడ్డి భవన్లో సిపిఎం రూరల్ కమిటీ సమావేశం అమ్మిశెట్టి రంగారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు వ్యతిరేకంగా ప్రజా పోరు పేరుతో సిపిఎం నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. ఒక చేత్తో ఇచ్చినట్టే ఇచ్చి, మరో చేత్తో అంతకుమించి కాజేస్తున్నారని విమర్శించారు. మద్యపానం నియంత్రిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి నేడు మద్యాన్ని ఏరులై పారిస్తున్నారనివిమర్శించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పాలన ఉందో, బిజెపి పాలన ఉందో ప్రజలకు అర్థం కావటం లేదని తెలిపారు. మాతోన్మాదం పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెట్టడానికి బిజెపి ప్రయత్నిస్తుందని ఆరోపించారు. జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ బిజెపి రూట్ మ్యాప్ తీసుకొని ముందుకెళ్తున్నరని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల్లో వస్తున్న అసంతప్తిని పక్కన పెట్టటానికి తిరుపతి లడ్డు, సనాతన ధర్మం అంటూ ఆవేశ ప్రసంగాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సనాతన ధర్మం అంటే ఏమిటో వివరించి, పవన్ కళ్యాణ్ ప్రజల ముందు మాట్లాడితే బాగుంటుందని చెప్పారు. సమావేశంలో సిపిఎం నాయకులు, దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి, కాజా వెంకటేశ్వరరావు, పల్లె కృష్ణ, ఎన్ కిషోర్, భార్గవ్ పాల్గొన్నారు.

వర్సిటీ దూరవిద్య ఎంబిఎ, ఎంసిఎ ఉమ్మడి ప్రవేశ పరీక్ష షెడ్యూల్ విడుదల



దూరవిద్య డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విద్యాలయం దూర విద్య కేంద్రం ఆధ్వర్యంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) కోర్సులలో ప్రవేశ పరీక్ష షెడ్యూలు విడుదల చేసినట్లు దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ప్రవేశ పరీక్ష వివరాలను వివరించారు. ఈనెల 9వ తేదీ రెండో శనివారం రాష్ట్రవ్యాప్తంగా 7 పరీక్ష కేంద్రాలలో మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4:30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని చెప్పారు. గురువారం వరకు అపరాధ రుసుము లేకుండా ప్రవేశ పరీక్ష ఫీజు రూ. 500 చెల్లించవచ్చుని తెలిపారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు చేయని అభ్యర్థులు నేరుగా టెన్త్ క్లాస్, డిగ్రీ ప్రొవిజినల్, మార్కుల జాబితా అభ్యర్థి ఫోటో తోపాటు రూ. 1500 తత్కాల్ ఫీజు చెల్లించి, పరీక్ష జరిగే 9వ తేదీన నేరుగా హాజరు కావచ్చు అన్నారు. సంబంధిత ప్రవేశ పరీక్ష ఫలితాలును ఈనెల 10వ తేదీన సాయంత్రం విడుదల చేస్తామని చెప్పారు.

ప్రవేశ పరీక్ష కేంద్రాలు

సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (గుంటూరు), ఆదిత్య డిగ్రీ కాలేజ్ (కాకినాడ), ఎం ఎస్ ఆర్ ఎస్ సిద్ధార్థ డిగ్రీ కాలేజ్ (విశాఖపట్నం), గీతం డిగ్రీ కాలేజ్ (ఒంగోలు), గేట్ డిగ్రీ కాలేజ్ (తిరుపతి), శ్రీ విజయ దుర్గ డిగ్రీ కాలేజ్ (కర్నూలు), శ్రీ సాయి డిగ్రీ కాలేజ్ (అనంతపూర్) మొత్తం 7 పరీక్ష కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.

ఎంట్రన్స్ మినహాయింపు

ఏపీ ఐసెట్ 2024లో అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఈ కోర్సుల్లో అడ్మిషన్లను పొందవచ్చు. ప్రత్యేకంగా ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు.

అర్హతలు

దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు కనీస విద్యార్హతలు కలిగి ఉండాలి. రెండేళ్ల వ్యవధి ఎంబిఏ జనరల్ కోర్సులకు ఏదైనా సబ్జెక్టులో డిగ్రీ కలిగి ఉండాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డిగ్రీలో 45 శాతం, మిగిలిన వారికి 50శాతం ఉత్తీర్ణత శాతం కలిగి ఉండాలని సూచించారు. ఎంబీఏ జనరల్ లో ఫైనాన్స్, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్మెంట్, బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ మేనేజ్మెంట్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ట్రావెల్ టూరిజం మేనేజ్మెంట్, బిజినెస్ ఎనాలిటిక్స్, ఇంటర్నేషనల్ బిజినెస్ మేనేజ్మెంట్ మొత్తం 8 స్పెషలైజేషన్స్ ఉన్నాయి. అందులో రెండిటిని మాత్రమే ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది.

ఎంసిఏ కోర్సులకు పది తర్వాత ఇంటర్, డిగ్రీ లేదా ఇంజనీరింగ్, డిప్లొమా తర్వాత డిగ్రీ పూర్తి చేసి ఉండాలి. ఎంసిఏ కోర్సులకు డిగ్రీలో తప్పనిసరిగా మ్యాథ్స్ చదివి ఉండాలి. దూర విద్యలో మ్యాథ్స్ డిగ్రీ చదివిన వారిని కూడా అర్హులుగా గుర్తిస్తారు. డిగ్రీలో మ్యాథ్స్ చదవని విద్యార్థులు ఇంటర్‌లోనైనా మ్యాథ్స్ సబ్జెక్టును చదివి ఉండాలి అని వెల్లడించారు. ఉమ్మడి ప్రవేశ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు వర్సిటీ వెబ్‌సైట్ www.anucde.info నుండి హాల్ టికెట్లను, ర్యాంక్ కార్డులు పొందవచ్చు అన్నారు. మరిన్ని వివరాలను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూర విద్య కేంద్రం www.anucde.info అధికారిక వెబ్‌సైటు నుండి, మరియు ఫోన్ నంబర్స్ - 98484 77441, 0863-2346323 సంప్రదించవచ్చుని డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు తెలిపారు.

కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలి

ఎమ్‌టిఎంసి కమిషనర్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య వాహనాల డ్రైవర్ల పై, కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపివేయాలని కోరుతూ బుధవారం మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ ఆలిం భాషకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు మంగళగిరి కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈదుల మూడి శేఖర్ అనే డ్రైవర్‌ను పని నుండి నిరుపేయడం జరిగిందని, రాజకీయ వేధింపులతో ఈ పని చేయడం జరిగిందని విన్నవించారు. వెంటనే వేధింపులను ఆపి పనిలోకి తీసుకోవాలని కోరారు. 2023 మార్చి నెలలో శేఖర్ మెల్లెంపూడి, ఇప్పటం గ్రామాలకు ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నారని తెలిపారు. అప్పటినుండి 20 నెలలుగా కేవలం 3 సెలవులు మాత్రమే పెట్టడం జరిగిందన్నారు. డ్రైవర్‌గా తాను నిర్వహిస్తున్న బాధ్యతలో ఏ రిమార్కు లేకుండా పనిచేయడం జరిగిందన్నారు. పనిలోకి చేరకముందు 2014లో ఎంపీటీసీగా గెలుపొంది శేఖర్ పని చేశారు. డ్యూటీలో చేరిన నాటి నుండి రాజకీయాలతో సంబంధం లేకుండా కార్పొరేషన్ అధికారులు ఏ పని చెబితే ఆ పని చేస్తూ ఉన్నాడన్నారు. అలాంటి శేఖర్ ను రాజకీయ కారణాలతో గత నెల అక్టోబర్ 26వ తేదీ నుండి పని నుండి నిలిపియడం జరిగిందని విన్నవించారు. ఇలాంటి పరిస్థితుల్లో కుటుంబ పోషణ కష్టంగా ఉందని వెంటనే శేఖర్ ను పనిలోకి తీసుకోవాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మంగళగిరి కమిటీ కార్యదర్శి ఎస్ ఎస్ చెంగయ్య, అధ్యక్షులు కె వెంగమ్మ, ఈ శేఖర్ పాల్గొన్నారు.



సమస్య పరిష్కరించే వరకూ ఆందోళన

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్ కోర్టు తీర్పుల ప్రకారం తమకు న్యాయంగా రావలసిన బకాయిలు వచ్చేంతవరకు ఆందోళన కొనసాగుతుందని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ చెప్పారు. తమ బకాయిలు సాధన కోసం కార్మికులు చేస్తున్న ఆందోళన బుధవారం నాటికి 10వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్టీవెన్ మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులం ఒంటరిగా లేవని, యాజమాన్యం గుర్తించాలని కోరారు. మంగళవారం అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ నాయకులతో పాటు అన్ని రాజకీయ పార్టీలు మద్దతుఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తామేమి గొంతెమ్మ కోరికలు కోరడం లేదని చెప్పారు. ఫ్యాక్టరీ సంపద సష్టించడానికి రెక్కలు ముక్కలు చేసుకొని తమ కష్టార్జితాన్ని తమకు ఇమ్మని మాత్రమే తాము అడుగుతున్నామని తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటే ఒకరోజులో ఈ సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. ముఖ్యంగా నియోజకవర్గ ఎమ్మెల్యే నారా లోకేష్ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఆర్ ఇస్రాయిల్, విజయం పిల్లే, ఎం ఆశీర్వాదం, గురవయ్య, వై సాంబయ్య, రమాదేవి, కేజీ కృష్ణ, ఎం కోటేశ్వరరావు పాల్గొన్నారు.



విధుల్లోకి ఎఆర్ అదనపు ఎస్పీ



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎఆర్ అదనపు ఎస్పీగా వి.సత్తిరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. తొలుత పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావును నరసరావుపేటలోని జిల్లా పోలీస్‌కార్యాలయంలో కలిశారు. ఈయన అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తూ బదిలీపై పల్నాడుకు వచ్చారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-ఈపూరు

మండల సర్వసభ్య సమావేవం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహిస్తామని ఎంపీడీవో కె.ప్రభాకరరావు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరవ్వాలని కోరారు.

టిడిపి సీనియర్ నాయకుడు మృతి

ప్రజాశక్తి - క్రోసూరు

మండలంలోని ఆందుకూరుకు చెందిన టిడిపి సీనియర్ నాయకులు తాళ్లూరు వీరభద్రం (80) బుధవారం మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరభద్రం భౌతికకాయాన్ని క్రోసూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కె.కాశీయ్య సందర్శించి పూలమాలలేసి నివాళు లర్పించారు.

టిటిడి బోర్డులో ఎస్టీలకు అవకాశం ఇవ్వాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలిలో గిరిజనులకు చోటు కల్పించాలని రాష్ట్ర గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం ఎస్టీలకు అవకాశం కల్పించిందని గుర్తు చేశారు.



కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మాచర్ల

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను భాగంగా ప్రతి మండల కేంద్రంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. పట్టణంలోని నరిశెట్టి కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన షాలోమ్ నియోజకవర్గ పాస్టర్ల ఐక్యత సమావేశానికి ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలతో పాటు గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు.

శాంతి భద్రతలకు ప్రాధాన్యమివ్వండి



ప్రజాశక్తి - మాచర్ల

నియోజకవర్గంలో శాంతి భద్రతలను కాపాడేందుకు తొలి ప్రాధాన్యమివ్వాలని డిఎస్‌పి జగదీష్‌ను మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు కోరారు. గురజాలలో డిఎస్‌పిగా బాధ్యతలను చేపట్టిన జగదీష్‌ను యాగంటి మల్లికార్జునరావు బుధవారం ఉదయం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మాచర్ల నియోజకవర్గంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించినట్లు చెప్పారు. ఫ్యాక్షన్ వివాదాలు, భూదందాలు తదితర వివాదాలు జరిగాయన్నారు. ప్రశాంత వాతవారణాన్ని కాపాడేందుకు తమ సహకారం ఉంటుందని చెప్పారు.

మిర్చిలో రసంపీల్చే పురుగులు



ప్రజాశక్తి - అచ్చంపేట

మిర్చిపైరులో రసం పీల్చే పురుగులను గమనించామని, నివారణకు వేప నూనె పిచికారి చేయాలని జిల్లా వనరుల శాఖ డిడిఎ ఎం.శివకుమారి సూచించారు. మండలంలోని పెదపాలెం, మిట్టపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. డిడిఎ మాట్లాడుతూ పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. వరిలో ప్రస్తుతం ఆకుముడత, కాండం తొలిచే పురుగుల ఉనికిని గుర్తించామన్నారు. నివారణకు క్లోరిపైరిఫోస్ 2.5 మిల్లీ లీటర్లు లేదా కార్టాప్ హైడ్రో క్లోరీడ్ 2 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో క్రోసూరు ఎడిఎ వి.హనుమంతరావు, మండలం వ్యవసాయ అధికారి పి.వెంకటేశ్వర్లు, సిబ్బంది నాగమణి, మాన్య, రహీం, మణి పాల్గొన్నారు.



ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలము తాళ్లపల్లిలోని మిర్చి పొలాలను ఉద్యాన శాఖాధికారి ఎన్.సురేష్ పరిశీలించారు. రసం పీల్చే పురుగులు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. నత్రజని ఎరువులను అధిక మోతాదులో వాడకూడదన్నారు. పసుపు రంగు, నీలిరంగు జిగురు అట్టలను ఎకరాకు 50 నుంచి 60 చొప్పున పొలంలో అక్కడక్కడ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పురుగుమందులైన అసిటామప్రిడ్ రెండు గ్రాములు లేదా థయోమిథాగ్జామ్ 0.5 గ్రాములు లేదా స్పైరో మెసిఫెన్ ఒక మిల్లీ లీటరు మందును లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. మొక్కలలో సూక్ష్మ పోషకాల లోపం ఉన్నట్లు గమనిస్తే ప్రతి 20 రోజులకు ఒకసారి ఫార్ములా-4ను ఐదు గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. బొబ్బర తెగులును గుర్తిస్తే ఆ మొక్కలను ప్రారంభ దశలోనే పీకి కాల్చివేయాలన్నారు. తెల్లదోమ నివారణకు అఫీడో ఫైరోపెన్ ఒక లీటర్ నీటికి 2 మిల్లీ లీర్లను కలిపి పిచికారి చేయాలని, గట్ల మీద కలుపు లేకుండా చూసుకోవాలని చెప్పారు. కాయ, కొమ్మ కుళ్ల నివారణకు ట్రిఫ్లాక్సీ స్ట్రోబిన్, టెబుకొనజోల్ కలిగి ఉన్న మందులను ఒక లీటర్ నీటికి 2.5 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో మాచర్ల మండల వ్యవసాయ అధికారి లక్ష్మారెడ్డి, తాళ్లపల్లి విహెచ్ఎ కరుణ నాయక్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని చందవరంలో పొలం పిలుస్తోంది నిర్వహించగా ఎడిఎ పి.మస్తానమ్మ హాజరయ్యారు. పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి ఎ.హరిప్రసాద్ మాట్లాడుతూ సిసిఐ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ పత్తిపంటను అమ్ముకోవాలని చెప్పారు. ముందుగా పేరు నమోదు చేయించుకుని కేటాయించిన తేదీల్లోనే వెళ్లాలని, లూజుగా గాని, జ్యూట్ బ్యాగుల్లో (బొరాలు) గాని తరలించాలని చెప్పారు. గ్రామ వ్యవసాయ సహాయకులు కోటంరాజు, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాను ఒక్కరోజూ ఆపొద్దు : ఎమ్మెల్యే



ప్రజాశక్తి-చిలకలూరిపేట

నీటి సరఫరాకు ఒక్కరోజు కూడా ఆటంకం లేకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని ప్రజారోగ్య విభాగం అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ మేరకు పట్టణంలోని తన నివాసంలో అధికారులతో ఆయన బుధవారం సమీక్షించారు. పట్టణంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు వీల్లేదని, కుళాయిల ద్వారానే సరఫరా చేయాలని చెప్పారు. అమృత్ పథకం నిధులు పూర్తి స్థాయిలో తెస్తే పట్టణానికి 24 గంటలూ తాగునీటి సరఫరాకు అవకాశం ఉంటుందని అధికారులు చెప్పారు. దీనిపై సమగ్ర నివేదికిస్తే మున్సిపల్ మంత్రితో మాట్లాడి మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే అన్నారు. సమీక్షలో ప్రజారోగ్య విభాగం ఎస్ఇ డి.శ్రీనివాసరావు, ఇఇ జి.వెంకటేశ్వరరావు, డిఇ రవికుమార్, జెఇ నాగ బ్రహ్మాచారి, మున్సిపల్ డిఇ రహీమ్ పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు వేగంగా పూర్తి చేసి అద్దంలా తీర్చిదిద్దాలని ఆర్ అండ్ బీ అధికారులను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశించారు. తన నివాసంలో ఆర్ అండ్ బీ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులకు నిధులు కేటాయించామని, ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టాలని చెప్పారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు ప్రాధాన్యమివ్వాలన్నారు. ఆక్సిడెంట్ జోన్లను గుర్తించి, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని దింతెనపాడులో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.14 లక్షలతో నిర్మించే బస్ షెల్టర్, సిసి రోడ్లు, సైడు కాల్వల పనులను ప్రారంభించారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.రాజారమేష్, కె.సాయిబాబు, శ్రీనివాసరావు, చౌదరి పాల్గొన్నారు.



ధ్రువపత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ

మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సల కోసం మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సల రిజిస్ట్రేషన్ల మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ప్రారంభించారు. సత్తెనపల్లి పట్టణంలోని టిడిపి ప్రజా వేదికలో నిర్వహించిన శిబిరంలో అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అమృత హాస్పిటల్స్ వారు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉచితంగా మోకాలు మార్పిడి సర్జరీల శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు అభినందించారు.

తీరు మారకుంటే ఊరుకోం : జనసేన

ప్రజాశక్తి- వెల్దుర్తి

సరస్వతీ భూములను పరిశీలించటానికి వచ్చిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై వైసిపి నాయకులు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, వారి నోర్లు అదుపులో పెట్టుకోవాలని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన కార్యదర్శి పులి హరి హెచ్చరించారు. మాచర్ల పట్టణంలోని జనసేన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి 1500 ఎకరాల భూములు ఫ్యాక్టరీ కోసం తీసుకొని ఫ్యాక్టరీ కట్టకపోగా అసైన్డ్ అటవీ భూములు సైతం రెవెన్యూ భూమిగా మార్చి ఫ్యాక్టరీ కింద తీసుకున్నారని విమర్శించారు. జగన్ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తరువాత తన ఫ్యాక్టరీ కోసం సేకరించిన భూములు 50 ఏళ్ళ పాటు లీజును పొడిగించుకున్నారన్నారు. జగన్ చేసిన తప్పిదాలను పవన్ ప్రశ్నస్తే వైసిపి నాయకులు అంబటి రాంబాబు, పేర్ని నాని, కాసు మహేష్‌రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ఈ తీరును జన సైనికులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. సమావేశంలో బి.రామాంజనేయులు, జి.సాంబశివరావు, జి.మల్లయ్య, టి.శ్రీను, కె.వెంకటరమణ, కె.లాల్‌కృష్ణ, షేక్ మదిన్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు అవకాశం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి - మాచర్ల

ఓటర్ల జాబితాలతో బూత్ లెవల్ అధికారులు ఆయా బూత్‌లలో ఈ నెల 9, 10, 23, 24 తేదీల్లో ఓటర్లకు అందుబాటులో ఉంటారని మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. ఓటర్ల జాబితా అంశంపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం సమావేశమయ్యారు. ప్రత్యేక డ్రైవ్‌లో ఓటరు జాబితాల్లో మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నారు. బుధవారం ఉదయానికి పట్టభద్రుల ఎంఎల్‌సి ఓటర్ల జాబితాలో పేర్లు నమోదుకు 6,372 ఆర్జీలు అందినట్లు తెలిపారు. వాటిలో 1,074 ఆర్జీలపై విచారణ పూర్తి అయినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ జాబితా రూపకల్పనలో బిఎల్‌ఓలు క్రియశీలకంగా పని చేయాలన్నారు. చనిపోయిన, డబుల్ ఎంట్రీలను తొలగించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్లు బి.వాణి, బాషా, రాజకీయ పార్టీల ప్రతినిధులు జి.నాసరయ్య, శివ, సైదయ్య యాదవ్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన పట్టభద్రుల ఓట్ల నమోదు

ప్రజాశక్తి -దాచేపల్లి

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలకు ఓట్ల నమోదులో భాగంగా బుధవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించి కేంద్రంలో 150 మంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకున్నారని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు తెలిపారు.

జాబ్‌కార్డు ఉన్నవారికి ఉపాధి పనులు కల్పించాలి

సమీక్షా సమావేశంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు మండ లాన్ని అభివృద్ధి పథంలో నిలపాలని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. బుధవారం పెదనందిపాడు ఎంపిడిఒ కార్యాలయంలో మండల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. శాఖల వారీగా సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబు కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాథమిక వైద్యశాలలో సిబ్బంది పనితీరు మెరుగు పడాలన్నారు. డ్రైనేజీ అధికారులు రైతుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని పనులు చేయాల న్నారు. అలసత్వం వీడి పనులు చేయాలని,



లేకపోతే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని అధికారులను హెచ్చరించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు కలిసి పని పనిచేయాలని సూచించారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో గుంటి లక్ష్మీదేవి, ఎమ్మార్వో పి శంకర్ బాబు, ఎస్సై మధు పవన్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ రీసర్వే అవకతవకలను సరిచేస్తాం

ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి - మేడికొండూరు

భూ రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఇచ్చిన భూసర్వే అర్జీలన్నింటినీ పరిశీలించి సరిచేస్తామని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ తెలిపారు. బుధవారం మేడి కొండురులోని వేణుగోపాలస్వామి కళ్యాణమండపంలో భూ రీ సర్వే గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు గత ప్రభుత్వ పాలనలో సర్వేలో అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు అందాయన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల పక్షాన ఉండి పూర్తిస్థాయి న్యాయం చేకూరుస్తుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సర్వేయర్ లక్ష్మీనారా యణ,



తహశీల్దార్ కే కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని ఇండియన్ బ్యాంక్ ఎటిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్



వినియోగదారులకు 24 గంటలు అందు బాటులో ఉండాల్సిన ఏటీఎం గత మూడు రోజులుగా పనిచేయక పోవడంతో , ఏటీఎం వినియోగదారులు అనేక అవస్థలు పడుతున్నారు. ఏటీఎం కార్డు ఉపయోగించి, నగదు కోసం వచ్చిన వారికి ఆ ఏటీఎంలో నిరాశే ఎదురవుతుంది. ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి ఇండియన్ బ్యాంక్ ఎటిఎం పనిచేయడం లేదని, కస్టమర్లు బ్యాంక్ అధికారులకు విన్నవించుకున్న ఫలితం శూన్యం. తమ తమ అవసరాల కోసం ఏటీఎం దగ్గరకు వచ్చే విద్యార్థులు, కౌలు రైతులు, సామాన్య మధ్యతరగతి ప్రజలు నగదు తీసుకునేందుకు వచ్చి, నిరాశతో వెను తిరుగుతున్నారు. బ్యాంక్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం గమనార్హం. కనీసం ఏటీఎంలో నగదు లేదని, పనిచేయడం లేదనో బోర్డు కూడా పెట్టలేని పరిస్థితి నెలకొంది.



నైపుణ్య గణన సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి - చేబ్రోలు

నైపుణ్య గణన నిర్వహించే సిబ్బంది అవగాహన పెంచుకోవాలని ఎంపిడిఒ కె లలిత అన్నారు. బుధవారం సర్వే నిర్వహించేందుకు మండలంలో 17 గ్రామ సచివాలయాల సిబ్బందికి రెండు బ్యాచ్‌లుగా ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. చేబ్రోలు ఎంపిపి సమావేశం మందిరంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. సర్వేలో సిబ్బందికి సమస్యలు ఎదురైతే అధికారులను సంప్రదించాలన్నారు. సిబ్బంది ఇంటింటికి తిరిగి నైపుణ్య గణన సర్వే ద్వారా నిరుద్యోగులను గుర్తించాలన్నారు. వారి జీవనాభివృద్ధికి అవసరమ్యే అవకాశాలను కల్పించేందుకు నిర్వహిస్తున్న సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి టి ఉషారాణి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీకు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఉప కమిషనరు శ్రీనివాసరావు

పెదకాకాని శివాలయ కమిటి ఏర్పాటు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో వైదిక ఆగమ కమిటిని ఏర్పాటు చేసినట్లు ఆలయ ఉపకమిషనరు, కార్యనిర్వహణాధికారి కెబి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం తన ఛాంబరులో నిర్వహించిన అర్చకుల సమావేశం ఆయన వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ జిఒ ఎంఎస్ నంబరు 223 అనుసరించి కార్యాలయ ఈవో సమక్షమున నిర్వహించిన దేవస్థాన అర్చకలు, వేదపండితుల తీర్మానం అనుసరించి వైదిక ఆగమ కమిటీ ఏర్పాటు పక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. కమిటీ అధ్యక్షులుగా ఆలయ స్థానాచార్యులు పొత్తూరి సాంబ శివరావు, సభ్యులుగా పొత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాదు, ప్రధాన అర్చకులు చదలవాడ జాలయ్య, ఉప ప్రధాన అర్చకలు పేటేటి ధనమహేశ్వరప్రసాదు, ఉప ప్రధాన అర్చకులు చదలవాడ శివశంకరశాస్త్రి, ముఖ్య అర్చకలు వ్యాకరణం గణపతిశర్మ, ఋగ్వేదం వేదపండితులు ఉన్నారని తెలిపారు. ఆలయంలో నిర్వహించే క్రతువులకు సంబంధించి కమిటీ నిర్ణయాలు తీసుకుంటుందని ఉపకమిషనర్ తెలిపారు.

పాలపర్రు గ్రామసభలో 37 అర్జీలు

ప్రజాశక్తి - పెదనందిపాడు

మండల పరిధిలోని పాలపర్రు రెవిన్యూ గ్రామసభ బుధవారం నిర్వహించారు. రీ సర్వే సమస్యలపై రైతుల నుండి అర్జీలు స్వీకరించారు. డిప్యూటీ తహశీల్దార్ షేక్ కరీముల్లా మాట్లాడుతు భూ రీసర్వే అర్జీలు రైతుల నుండి 37 అందాయని తెలిపారు.



రికార్డు ధర పలికిన పసుపు దువ్వ

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యార్డులో బుధవారం నిర్వహించిన పసుపు దువ్వ వేలం పాటలు రికార్డు పలికిందని యార్డు కార్యదర్శి ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. వేలంపాటలో ఎనిమిది మంది పాల్గొన్నారని, రూ.లక్షా1100లకు కోనంగి శంకరరావు అనే రైతు పాడు కున్నాడని ఈ సందర్భంగా శ్రీనివాసరావు తెలిపారు. గత సంవత్సరం ఆదాయం రూ. 22,000 కాగా ఈ సంవత్సరం గత సంవత్సరం కన్నా రూ.79 వేల వంద రూపాయలు అధికంగా యార్డుకు ఆదాయం వచ్చిందన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎడి రాజశేఖర్

సోలార్ విద్యుత్‌తో ఎన్నో ఉపయోగాలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

సోలార్ విద్యుత్ వాడకం వలన తక్కువ ఖర్చుతోపాటు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని విద్యుత్ శాఖ ఏడి రాజశేఖర్ అన్నారు. మండలంలోని రేవేంద్రపాడు పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. సోలార్ వాడకం డబ్బు ఆదాతో పాటు విద్యుత్ కొరత నివారించవచ్చునని తెలియజేశారు. ప్రజలు సోలార్ ఉపయోగించుకుని, వినియోగానికి అలవాటు పడాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పలుకూరి మేరమ్మ ఏ ఈ వసంతరావు లైన్మెన్ రాజశేఖర్ సోలార్ కాంట్రాక్టర్ కేసు రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి పట్టణంలోని పాత రత్నా టాకీస్ రోడ్డు నుండి శివాజి బొమ్మ సెంటర్ వరకు రోడ్డు విస్తరణ పనులను మునిసిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక బుధవారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ. 20.5 లక్షల వ్యయంతో 130 మీటర్ల రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. పట్టణ సుందరీకరణ, పట్టణాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం 5, 6 వార్డుల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. శానిటేషన్ సిబ్బందికి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరి ప్రసాద్, కౌన్సిలర్లు తోట రఘురామ్, కొర్రపాటి లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, మున్సిపల్ ఇంజనీరు ఆకుల శ్రీనివాసరావు,



కార్యక్రమంలో పాల్గొన్న చైర్ పర్సన్ రాధిక

అసిస్టెంట్ ఇంజనీరు సూరిబాబు, అసిస్టెంట్ సిటి ప్లానర్ శ్రీమన్నారాయణ, టౌన్ ప్లానింగ్ అధికారి సాంబశివరావు, ఎంహెచ్‌ఓ హెలెన్ నిర్మలతదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

రాబోయే మార్చి 31 నాటికి జగనన్న గృహ నిర్మాణాలు పూర్తి చేయకపోతే ప్రభుత్వం నుండి ఎటువంటి సహాయం అందదని గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జె.వి.ఎస్.ఆర్ కె.వి ప్రసాద్ అన్నారు. మండలంలోని చిలువూరు గ్రామంలో బుధవారం జగనన్న కాలనీలోని లబ్ధిదారులతో మాట్లాడారు. ఇప్పటికే నిర్మాణం చేపట్టిన గృహాలకు యూనిట్ కాస్ట్ పెరిగే అవకాశం లేదని తెలిపారు. లెంటల్ వరకు వచ్చి నిలిపేసిన లబ్ధిదారులకు అధికారులతో సంప్రదించి డ్వాక్రా రుణాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీపీ షేక్ జబీన్ సర్పంచ్ చిలువూరు మాణిక్యం గ్రామ కార్యదర్శి ఎం శరత్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు



చిలువూరులో జగనన్న గృహాలను పరిశీలిస్తున్న కెవి ప్రసాద్

లబ్ధిదారులందరూ మార్చి 31 నాటికి గహ నిర్మాణం పూర్తి చేసేందుకు తీసుకోవలసిన చర్యలు సూచనలు వారికి తెలిపారు. కార్యక్రమంలో యానిమేటర్లు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పేదల పొట్ట కొట్టి పెద్దలకు ఊడిగం చేస్తున్న ప్రధాని

సిపిఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్

ప్రజాశక్తి - తాడికొండ

పేదల పొట్టకొట్టి ప్రధాని నరేంద్ర మోదీ అదాని, అంబాని లాంటి పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తున్నాడని సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. బుధవారం పొన్నెకల్లు సిపిఐ కార్యాలయంలో నియోజకవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. యుద్ధ ప్రాతిపదికన రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలన్నారు. ఎన్నికల హామీలు భాగంగా పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్ల స్థలం ఇవ్వాలన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యవసర వస్తువుల ధరలతో పాటు పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగాయని సగటు మానవుడు బ్రతికే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. సంఘ పరివార్ శక్తులు మతోన్మాద దాడులకు



తెగబడుతున్నారని అన్నారు. జగన్, పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు మోడీ కభంధహస్తాలలో బందీ అయ్యారని విమర్శించారు. సూపర్ సెక్స్ పథకాలను త్వరిత గతిన అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాలతో ప్రజలపై విద్యుత్ భారం రూ.18 వేల కోట్లు పడిందన్నారు. ఇసుక సరఫరా లో వైసిపి, టిడిపి వైఖరి ఒకే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పచ్చల సాంబశివరావు, పచ్చల శివాజీ , కాబోతు ఈశ్వరరావు, శివ శంకర్ రావు, నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య, తదితరులు

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు విజ్ఞాన్స్ విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి చెందిన 6గురు విద్యార్థులు జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. బుధవారం ఆయా విద్యార్థులను విజ్ఞాన్ విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, వీసీ నాగభూషణ్ అభినందించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన 4వ ఏపీ సీనియర్ క్యోరుగి తైక్వాండో చాంపియన్‌షిప్-2024లో విజ్ఞాన్స్ యూనివర్సిటీ విద్యార్థులు 5 బంగారు పతకాలు, 6 రజత పతకాలు, 4 కాంస్య పతకాలు సాధించారని వెల్లడించారు. బంగారు పతకాలు సాధించిన బీహెచ్ సామ్యూల్‌చార్లీ, డీ.హర్షిత్, ఏ.భవిష్య, వి.నిఖిల, ఎండీ.కరిష్మ, రజత పతకం సాధించిన ఎం.ఎం.ఆషంటే నవంబర్ నెల చివరి వారంలో అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో జరగబోయే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలియజేసారు. విద్యార్థులను అభినందించిన వారిలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాధన్ తదితరులున్నారు.



డాక్టర్ శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న టిజెపిఎస్ కళాశాల సెక్రెటరీ తదితరులు

జీవితాన్ని ఉన్నతంగా తీర్చి దిద్దుకోవాలి

విజయవాడ కెబిఎన్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాస్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక టిజెపియస్ కళాశాలలో బుధవారం డిగ్రీ, పి.జి.విద్యార్థులకు గోల్ సెట్టింగ్ ఫర్ బ్రైట్ ఫ్యూచర్ అనే అంశంపై ప్రేరణాత్మక తరగతులు నిర్వహించారు.కళాశాల సెక్రటరీ, కరెస్పాండంట్ కె.వి.బ్రహ్మం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విజయవాడ కె.బి.యన్. కళాశాల సెక్రటరీ, కరెస్పాండంట్ డాక్టర్ టి.శ్రీనివాస్ ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి ప్రధానంగా స్పష్టమైన లక్ష్యం ఏర్పాటు చేసుకొని, దాని సాధనలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలన్నారు. రంగం ఏదైనా రాణించే నేర్పు, సమయపాలన, అకుంటిత దీక్ష, అందరితో కలిసిపోయే స్వభావం, విద్యలో పోటీ పడే తత్త్వం ఉండాలన్నారు. అంతే కాకుండా ఉన్నటువంటి ఒక్క జీవితాన్ని చాలా అందంగా మలచుకోవాలని, తల్లి తండ్రులను, గురువులని ఎప్పటికీ మరచిపోకూడదన్నారు. కార్యక్రమంలో కెబియన్ కాలేజి నుండి డాక్టర్. వి.నారాయణరావు, డాక్టర్. రమేష్, డాక్టర్. కె. రామకష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి మల్లఖంబ్ పోటీలకు తెనాలి విద్యార్థులు

ప్రజాశక్తి-తెనాలిరూరల్



మల్లఖంబ్ క్రీడలకు ఎంపికైన విద్యార్థులు

శ్రీ రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి మల్లఖంబ్ పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు సిహెచ్ సుందరరావు తెలపారు. బుధవారం కర్లపాలెం మండలం చింతాయపాలెంలో పోటీలు నిర్వహించినట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు టి ప్రసాద కుమారి, కొడాలి గోవర్ధన తెలియజేశారు. అండర్-19 బాలికల పోటీల్లో షేక్ సుహానా (9వ తరగతి), బాలుర విభాగంలో కే శివయ్య, అండర్-17 బాలికల విభాగంలో వర్షిత ప్రియ(9వ తరగతి), బాలుర విభాగంలో బాణావత్ ఇంద్ర నాయక్ (9వ తరగతి) అండర్-14 బాలికల విభాగంలో పావని శ్రీవిద్య (6వ తరగతి), బాలుర విభాగంలో దమ్ము నాగచైతన్య(8వ తరగతి) నవంబర్ 9న భీమవరంలో నిర్వహించే రాష్ట్రస్థాయి మల్లఖంబ్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల ఇంచార్జి ప్రధాన ఉపాధ్యాయులు తెలిపారు.

డిసెంబర్ 15లోగా హాస్టల్ భవన నిర్మాణం పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి-గుంటూరు



కోడిగుడ్డు సత్రం హాస్టల్ భవనాన్ని సందర్శించిన కలెక్టర్ తదితరులు

పాతగుంటూరులో అసంపూర్తి నిర్మాణంగా వున్న ఇంటిగ్రేటెడ్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌ను బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పరిశీలించారు. 90 సెంట్ల విస్తీర్ణంలో గత ఐదు ఏళ్ళ క్రితం మూడు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టడం జరిగిందని, ప్రస్తుతం వున్నటువంటి బిల్డింగ్ స్ట్రక్చర్ నిర్మాణానికి రూ.2.10కోట్లు ఖర్చు పెట్టినట్లు ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ బి.అనిల్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు. బిల్డింగ్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు మరో రూ.90 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించి సోషల్‌వెల్ఫేర్ గ్రాంట్ ద్వారా బిల్డింగ్ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈఏడాది డిసెంబర్ 15వ తేదీలోపు నిర్మాణ పనులు పూర్తిగా చేపట్టి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. అనంతరం ఏ.సి కాలేజీ ఎదురుగా వున్న పురాతన ప్రభుత్వ ప్రాంతీయ గ్రంధాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. గ్రంధాలయంలోని అన్ని విభాగాలను పరిశీలించి భవనం శిధిలావస్థలో ఉండటం గమనించి పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎపిఇడబ్ల్యూఐడిసి ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. లైబ్రరీలో లైట్లు , ఫ్యాన్ల కొరత వుందని పాఠకులు కలెక్టర్ దష్టికి తీసుకురాగా, వాటిని సమకూర్చుతామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ ఇంజినీర్ బి.ఏ.రవీంద్ర, గుంటూరు తూర్పు మండల తహశీల్దార్ నగేష్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారిణి చెంచు లక్ష్మి , గ్రంధాలయ అధికారులు పాల్గొన్నారు.

నెలాఖరుకు ప్యాచ్ వర్కులు పూర్తికావాలి : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు



గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో నవంబర్ నెలాఖరు నాటికి రోడ్ల ప్యాచ్‌వర్క్‌లు పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం గుంటూరు నగరంలో జరుగుతున్న రోడ్ల మరమ్మతు పనులపై డివిజన్ల వారీగా ఇంజినీరింగ్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో రహదారులపై 3వేల వరకు ప్యాచ్‌లు, రోడ్ మరమ్మతులు చేయాల్సినవి గుర్తించామని చేయాల్సిన వాటిని గుర్తించామని, వాటికి షుమారు రూ.2.56 కోట్లతో అంచనాలు సిద్దం చేసుకొని, డిశంబర్ 15 నాటికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టడానికి యాక్షన్ ప్లాన్‌సిద్దం చేశామన్నారు. ఇప్పటికే షుమారు 12 వందల ప్యాచ్‌వర్క్‌లు పూర్తి చేశామన్నారు. బ్రాడీపేట 4వ లైన్‌లో నూతన బిటి రోడ్‌ని ఎండ్ టు ఎండ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. నందివెలుగు రోడ్ ఏర్పాటు పై సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వేగవంతం చేయాలని స్పష్టం చేశామన్నారు. అలాగే నగరంలోని నల్లచెరువు మెయిన్ రోడ్, విఐపి రోడ్, పాత గుంటూరు బాలాజీ నగర్, తారకరామ నగర్, అంబేద్కర్ నగర్, ఆనందపేట, సంగడి గుంట, లాంచెస్టర్ రోడ్, ఐపిడి కాలనీ, ఎస్‌విఎన్ కాలనీ, బ్రాడీపేట బ్రిడ్జి సర్వీస్ రోడ్లు, ముత్యాలరెడ్డి నగర్, దేవాపురం, కోబాల్ట్‌పేట పలు ప్రాంతాల్లో యుద్ద ప్రాతిపదికన రోడ్ మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించామని తెలిపారు. రోడ్ మరమ్మతులతో పాటుగా ఎక్కడైనా ప్రజల అవసరాల రీత్యా నూతన డ్రైన్లు, కల్వర్ట్‌ల నిర్మాణ అవసరాలను గుర్తిస్తే ప్రతిపాదనలు సిద్దం చేయాలని ఆదేశించారు. ఏఈలు ప్యాచ్ వర్క్ పనులు నాణ్యతతో జరిగేలా పర్యవేక్షణ చేయాలని, లోపాలు వస్తే సంబందిత ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు భాధ్యత వహించాలని ఆదేశించారు.



మీడియాతో మాట్లాడుతున్న పశ్చిమ డిఎస్‌పి జి. జయ రాం ప్రసాద్

వైసిపి నాయకుడు అరెస్టు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయు డుతో సహా టిడిపి నాయకుల పై ఫేస్ బుక్‌లో అసభ్యకరమైన పోస్టింగులు పెట్టి నందుకు తాడేపల్లికి చెందిన వైసీపీ నాయకుడు మేక వెంకటరామిరెడ్డిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. గుంటూరు పశ్చిమ డి.ఎస్.పి. జి. జయ రాంప్రసాద్ బుధవారం రాత్రి తన కార్యా లయంలో జరిగిన మీడియా సమా వేశం లో మాట్లాడారు. సిఎం, పలువురు ఎంఎల్‌ఏ లపై అనుచిత వ్యాఖ్యలను పోస్ట్ చేయడం పై గుంటూ రుకి చెందిన మాగులూరి కోటేశ్వర రావు ఇచ్చిన పిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వెంక ట్రామిరెడ్డి ఐదు పేర్లతో ఫేస్ బుక్ ఖాతాలను నిర్వహిస్తున్నారని డి.ఎస్.పి. జయరాం తెలిపారు.

వైద్యారోగ్య శాఖలో సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు



కృష్ణబాబుకు సమస్యలు వివరిస్తున్న ఏపీ హంస అసోసియేషన్ నాయకులు

వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఎపి హంస అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ అరవపాల్ కోరారు. బుధవారం స్పెషల్ చీఫ్ సెక్రెటరీ ఎం.టి. కృష్ణబాబును కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అరవపాల్ మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించకుండా ఎఫ్ఆర్ఎస్ హాజరుతో ఉద్యోగుల జీతాల్లో కోత విధిం చటం అన్యాయమని అన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఎఫ్ఆర్ఎస్ హాజరుతో కోత విధించిన జీతాలు తిరిగి చెల్లించాలని కోరారు. కొత్తగా రెగ్యులర్ అయిన హెల్త్ అసిస్టెంట్, ఫార్మసిస్ట్, ల్యాబ్‌టెక్నీషియన్ ఉద్యోగుల ప్రొబేషన్ ఒక సంవత్సరానికి తగ్గించాల న్నారు. సచివాయలం ఏఎన్ఎంల హాజరు 10-5 గంటల నుండి 9-4 గంటలకు మార్చాలని, సచివాలయం ఏఎన్ఎంలు గ్రేడ్-3 నుంచి ఎంపిహెచ్ఎ(ఎఫ్) గ్రేడ్-2 ప్రమోషన్‌కు సంబంధించిన ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఆయా అంశాలను కృష్ణబాబు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. కృష్ణబాబును కలిసిన వారిలో స్టేట్ సెక్రెటరీ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ బి.కిరణ్, జిల్లా అధ్యక్షులు బి.నాగవర్ధణ్, మహమ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.